క్లుప్తంగా

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక


నూతన కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్

రుద్రూర్: కోటగిరి మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని సోమవారం మండల కేంద్రంలో జిల్లా ఇన్‌చార్జి వెంకట స్వామి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ వివరాలను జిల్లా నాయకులు ప్రకటించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా హస్కుల్ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా రేణి సాయిలు, ఉపాధ్యక్షులుగా కన్నం శ్రీనివాస్, జలయ్య, కోశాధికారిగా దండి సాయిబాబు, సహాయ కార్యదర్శిగా నితిన్, ప్రచార కార్యదర్శిగా విజయ్, కార్యదర్శిగా దేగం రవిందర్, కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్టు వారు వివరించారు.

శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని శాపూర్ గ్రామంలో సోమవారం శ్రీ కేదారీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహరాజ్ ఛత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. గ్రామంలో గత వారం రోజులు నుంచి విగ్రహ నిర్మాణానికి విరాళాలు సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా మంగిరాములు మహరాజ్‌ను యువకులు సన్మానించారు.కార్యక్రమంలో దినేష్‌గౌడ్, మహేష్, అరవింద్, సందీప్, పిట్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ రుసుంపై 25 శాతం రాయితీ

ఆర్మూర్ టౌన్ : తెలంగాణ ప్రభుత్వము ప్రకటించిన భూమిక్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) రుసుంపై 25% రాయితీ ఈనెల 31వ తేదీ వరకు కల్పించిందని మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. 2020సంవత్సరంలో రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసుకున్న ప్లాట్ యజమానులు 31 మార్చి 2025 లోగా పూర్తి ఫీజు చెల్లించి 25% రాయితీ పొందవచ్చన్నారు. భవిష్యత్తులో అధిక రుసుము చెల్లించాల్సిన అవసరం లేకుండా ప్లాట్‌ను క్రమబద్ధీకరించుకునే మంచి అవకాశం ఉందన్నారు. నిషేధిత భూములు కానివి, వాటర్ బాడీస్‌కు 200 మీటర్ల దూరంలో ఉన్న సుమారు 2200 ప్లాట్లకు సంబంధించి దరఖాస్తుదారులకు ఫీజు ఇంటిమేషన్ లెటర్లు అందించడం జరిగిందన్నారు. వీరు కూడా 25% రాయితీతో ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలన్నారు. మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌లైన్ నంబర్ 8341881864కు సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్ నాయకుల చొరవతోనే నిధులు మంజూరు



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని అయిలాపూర్‌లో గల ఎస్సీ బాలుర వసతి గృహానికి కాంగ్రెస్ నాయకులు చొరవ తీసుకోవడంతోనే నిధులు మంజూరైనట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హాస్టల్‌కు రూ.2.45 కోట్లు నిధులు మంజూరు చేయడంతో సీఎం రేవంత్ రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నిధులు మంజూరు చేశామని ప్రతిపక్ష నాయకులు ప్రగల్భాలు పలకడం సరికాదన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బైండ్ల ప్రశాంత్, డీసీసీ డెలిగేట్ దేవిదాస్‌గౌడ్, సొసైటీ మాజీ చైర్మన్ లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ తోటగణేష్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, యూసుఫ్, రాజు, దమ్మాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉద్యోగ మేళా

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 5న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసిస్ట్, జూనియర్ అసిస్టెంట్, ఆడిటర్, సీఎస్ఏ పోస్టులకు మెడ్‌ప్లస్ కంపెనీ జాబ్‌మేళా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఇంటర్, బీఫార్మసీ, ఎం ఫార్మసీ, ఏదైనా డిగ్రీ పాసైన వారు ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు శివాజీనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 99487 48428, 63057 43423, 77022 59070 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ఇంటి పన్ను వసూలు అయ్యేనా..?

- బాల్కొండ మండలంలో పేరుకు పోయిన బకాయిలు
- మిగిలింది 27 రోజులే
- ఇప్పటి వరకు వసూలైంది 66.4 శాతం


బోదెపల్లిలో పన్ను వసూలు చేస్తున్న కార్యదర్శుల బృందం

బాల్కొండ: బాల్కొండ మండల పరిధిలోని గ్రామాల్లో ఇంటి పన్ను బకాయిలు పేరుకుపోయాయి. పల్లెల్లో పనులు పడకేయడంతో పన్ను వసూలులో అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలో పది గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మండల కేంద్ర పంచాయతీలో ఆర్థిక సంవత్సరానికి రూ.52,66,882 డిమాండ్ ఉంది. మండల పరిధిలోని అన్ని జీపీలు కలిపి రూ.1,03,68,662 డిమాండ్ ఉంది. అందులో ఇప్పటి వరకు రూ.68,84,283 వసూలు చేశారు. ఇంకా రూ.34,84,339 వసూలు కావాల్సి ఉంది. గ్రామాల్లో మురికి కాలువల్లో పూడిక తొలగించుట కు డబ్బులు లేవు. ఇంటి పన్ను వసూలు అయితేనే సిబ్బందికి వేతనాలు చెల్లించే పరిస్థితి నెలకొంది. అభివృద్ధి పనులు చేపట్టాకే ఇంటి పన్నులు కడుతామని కొన్ని గ్రామాల్లో ప్రజలు మొండికేస్తున్నారు. నిధులు లేక పోవడంతో అధికారులు ఎలాంటి హామీలు ఇవ్వలేక పోతున్నారు.

బృందాలుగా తిరుగుతున్నా..

ఇంటి పన్ను వసూలు కోసం కార్యదర్శులు బృందాలుగా తిరుగుతున్నా పన్ను వసూలు కావడం లేదు. మేజర్ గ్రామ పంచాయతీల్లో బకాయిలు ఎక్కువగా పేరుకుపోయాయి. పన్ను వసూలు చేయుటకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎలాంటి చర్యలు తీసుకున్నా స్థానిక నేతలు అడ్డుపడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగింపునకు నెల మాత్రమే ఉంది. ఇప్పటి వరకు 66.4 శాతం ఇంటి పన్ను వసూలు కాగా, 27 రోజుల్లో మిగిలిన పన్నును వసూలు చేయాల్సి ఉంది.

చర్యలు తీసుకుంటున్నాం

మండల పరిధిలోని గ్రామాల్లో నూరు శాతం ఇంటి పన్ను వసూలు చేయుటకు చర్యలు తీసుకుంటున్నాం. బృందాలను ఏర్పాటు చేసి వసూలు చేపడుతున్నాం. త్వరలోనే పూర్తి స్థాయిలో ఇంటి పన్ను వసూలు చేస్తాం.

– గంగామోహన్, ఎంపీవో, బాల్కొండ

ఆర్మూర్ మున్సిపల్‌లో అక్రమాలపై బీజేపీ నిరసన


ప్రత్యేక అధికారి గదికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ కమిషనర్ రాజు సీఎంవోకి తప్పుడు నివేదిక అందించారని ఆరోపిస్తూ, అయనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన కార్యదర్శి జీ వీ నరసింహారెడ్డి, పట్టణ అధ్యక్షులు మందుల బాలు డిమాండ్ చేశారు.ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో సోమవారం బీజేపీ నాయకులు ప్రత్యేకాధికారి గదికి వినతి పత్రం అంటించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్‌లో 144 అక్రమ ఇంటి నంబర్లను రద్దు చేశామని నివేదికలో పేర్కొన్నప్పటికీ, అవి ఇప్పటికీ అలాగే కొనసాగుతున్నాయని ఆరోపించారు. అక్రమ కాంప్లెక్స్‌లను యథావిధిగా వాడుతూ, కిరాయికి ఇచ్చి యజమానులు లాభాలు పొందుతున్నారని పేర్కొన్నారు. ఈకార్యాక్రమంలో బీజేపీ నాయకులు కిసాన్ మోర్చా నాయకుడు నూతల శ్రీనివాస్‌రెడ్డి, జెస్సు అనిల్, ద్యాగ ఉదయ్, ఆకుల శ్రీను, ఆకుల రాజు, పాన్ శీను, రాజేశ్వర్, తిరుపతి నాయక్, ఖాందేష్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విజేతకు చెక్కు అందజేస్తున్న నిర్వాహకులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ కాంతి హైస్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో సత్తా చాటినట్లు పాఠశాల కరస్పాండెంట్ కాంతి గంగా రెడ్డి సోమవారం తెలిపారు. హైదరబాద్‌లో విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి అబాకస్ మరియు వేదిక్ మ్యాథ్ పోటీలు నిర్వహించారు. వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో పాఠశాలకు చెందిన రుద్రాన్ష్ చాంపియన్‌గా నిలిచాడని పేర్కొన్నారు. అలాగే రూ.5వేల నగదు పారితోషకాన్ని గెలుచుకున్నాడు. అలాగే పాఠశాలకు చెందిన మరో విద్యార్థి స్వజిత్ రెండో స్థానంలో నిలిచి రూ.2 వేల నగదు పారితోషకాన్ని గెలుచుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ట్రైనర్ విశాలిని కరస్పాండెంట్ కాంతి గంగారెడ్డి అభినందించారు.

కొలతల్లో తేడాలు.. బాధ్యులకు జరిమానా

- కోటగిరిలో ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక


ఈజీఎస్ ప్రజావేదికలో గ్రామస్థాయి ఆడిట్ వివరాలు వెల్లడిస్తున్న డీఆర్‌పీలు

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదికను సోమవారం ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల్లో ఆడిట్ బృందం నిర్వహించిన సామాజిక తనిఖీలో బహిర్గతమైన వివరాలను డీఆర్పీలు ప్రజావేదిక ముందుంచారు. ఉపాధి పనులకు సంబంధించిన రికార్డులు సరిగా లేకపోవడం, కూలీలకు ఇచ్చిన పనికొలతల్లో తేడాలను సభ్యులు గుర్తించారు. దీంతో బాధ్యులకు సుమారు రూ.22 వేలు జరిమానా విధించారు. కార్యక్రమంలో డీఆర్డీవో సాయాగౌడ్, జిల్లా విజిలెన్స్ అధికారి నారాయణ, సోషల్ ఆడిట్ సీఆర్పీలు రాజశేఖర్, ఆజాద్ అలీ, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఈజీఎస్ ఏపీవో గంగారాం తదితరులు పాల్గొన్నారు.

చురుకుగా సీసీ డ్రెయినేజీ కాలువ నిర్మాణం



వేల్పూర్: మండల కేంద్రంలో తహసీల్దార్, పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి వెంట సీసీ డ్రెయినేజీ నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఈ కాలువ నిర్మాణం కోసం రూ. 35 లక్షలు మంజూరు చేయించారు. బీసీ కాలనీని అనుకొని ఉన్న మర్సుకుంట చెరువు అలుగునీరు ప్రతి వర్షాకాలంలో రహదారిపైకి రావడం, కాలనీలోకి చేరడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మర్సుకుంట అలుగు నుంచి పోలీస్‌స్టేషన్ దాటిన తర్వాత ఉన్న కల్వర్టు వరకు కాలువ నిర్మాణం జరుగుతోంది. చెరువునీరు కాలువద్వారా కల్వర్టు దాటి పంట పొలాలవైపు వెళ్తుంది.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- సీఐ వెంకటనారాయణ


మాట్లాడుతున్న సీఐ వెంకటనారాయణ

బోధన్ టౌన్ (బోధన్): ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ వెంకటనారాయణ ప్రజలకు సూచించారు. మోసానికి గురైన వెంటనే 1930 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. ఇన్‌చార్జి సీపీ ఆదేశాలతో పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో సోమవారం నిజామాబాద్ పోలీస్ కళాబృందం కళాజాత కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. మహిళలకు ఇబ్బంది తలెత్తినప్పుడు షీ టీం నంబర్ 87126 59795 లేదా డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు నకిలీ ఏజెంట్లతో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

నల్ల పోచమ్మ దేవి విగ్రహ శోభాయాత్ర



రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో సోమవారం నల్ల పోచమ్మ విగ్రహ ఊరేగింపు చేపట్టారు. గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన నల్ల పోచమ్మ దేవాలయంలో విగ్రహావిష్కరణ మంగళవారం కొనసాగనుంది. సోమవారం పెద్ద హనుమాన్ మందిరం నుంచి ప్రధాన వీధుల గుండా మహిళల మంగళ హారతుల మధ్య శోభాయాత్ర కొనసాగింది. గ్రామ పెద్దలు గంగాధర్ దేశాయ్, కర్నే గజేందర్, తెల్ల రవికుమార్, బర్ల మధుకర్, గాండ్ల వీరేశం, బీర్కూర్ శ్యామ్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రాజు మధు వేముల రవి పూదరి సాయిలు వివిధ కుల సంఘాల పెద్దలు మహిళలు పాల్గొన్నారు.

హనుమాన్ మండల దీక్షలు ప్రారంభం



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో సోమవారం ఆంజనేయ స్వామి మండల దీక్షలు ప్రారంభమయ్యాయి. స్థానిక జంభి హనుమాన్ దేవాలయంలో అర్చకుడు కప్పగంటి రమేష్‌చంద్రశాస్త్రి 80 మంది ఆంజనేయ స్వాములకు మంత్రోచ్చారణలతో మాలధారణ చేశారు. పర్యావరణాన్ని కాపాడాలనే ఉద్దేశ్యంతో అరటి ఆకులు లేదా మోతికాకుల్లో బిక్షలు చేయాలని స్వాములు నిర్ణయించారు.

స్వాములకు పల్లెంలు, గ్లాసుల వితరణ..

ఆంజనేయస్వామి మాలధారణ చేసిన స్వాములకు స్థానిక కిరాణ దుకాణ యజమాని ధాత్రిక రాజ్‌కుమార్ స్టీల్ భోజన పళ్లెంలు, గ్లాసులు వితరణ చేశారు. 80 మంది స్వాములకు అందజేశారు. అర్ధ మండల దీక్ష, 11 రోజుల దీక్ష స్వాములకు కూడా అందజేస్తామని దాత రాజ్‌కుమార్ తెలియజేశారు.

నేటి నుంచి లక్ష్మీవేంకటేశ్వరస్వామి పసుపు బాలాజీ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

వేల్పూర్: మండలం కుకునూర్ గ్రామంలో మంగళవారం నుంచి శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి పసుపు బాలాజీ 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. బ్రహ్మోత్సవాల కోసం ఆలయకమిటీ, గ్రామాభివృద్ధికమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. వైదిక పురోహితులు ప్రశాంత్‌చార్యుల ఆధ్వర్యంలో మంగళవారం అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన, బుధవారం నిత్యహోమం, ఎదుర్కోలు, శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం, జాతర, సాయంత్రం రథోత్సవం జరుగుతాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు వేంకటేశ్వరస్వామి దీక్ష పాటిస్తున్నారు.

నేడు విఠలేశ్వర ఆలయంలో సమావేశం

రుద్రూర్: మండల కేంద్రంలోని శ్రీ విఠలేశ్వర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం నిర్వహణకు సంబంధించి మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 10:30 గంటలకు ఆలయ కమిటీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

ఆర్థిక సహాయం అందజేత


ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎంపీవో

వేల్పూర్: మండలంలోని లక్కోర గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన కారోబార్ సాయన్న కుటుంబానికి రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని ఎంపీవో సాయిలు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో లక్కోర జీపీ కార్యదర్శి మద్దూరి విజయ్‌కుమార్, కుటుంబీకులు పాల్గొన్నారు.

నందిపేటలో..

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రానికి చెందిన నాగం రవి మృతి చెందడంతో మృతుని కుటుంబానికి స్థానికులు ఆర్థిక సహాయం చేశారు. నాగం రవి ప్రమాదవశాత్తు ఆదివారం నందిపేట గ్రామ ఊర చెరువులో పడి మృతి చెందాడు. ఈ మేరకు స్థానిక నాయకుడు మాన్పూర్ భూమేష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 2వేల నగదు, 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. అలాగే దాబా గంగన్న రూ. వెయ్యి నగదును అందజేశారు.

స్వగ్రామానికి మోహన్ మృతదేహం

మాక్లూర్: దుబాయ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని గుత్ప గ్రామానికి చెందిన చలిగంటి మోహన్ (35) మృతదేహం సోమవారం స్వగ్రామానికి చేరింది. కుటుంబ సభ్యులు రోదనల మధ్య అంత్యక్రియలు పూర్తయ్యాయి. వివరాల్లోనికి వెళ్తే.. చలిగంటి మోహన్ 5 నెలల క్రితం దుబాయ్ వెళ్లి ఓ కంపెనీలో డెలివరి బాయ్‌గా చేరాడు. ఈ క్రమంలోనే గతనెల 23న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.

నిషేధిత ప్లాస్టిక్ స్వాధీనం



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి గ్రామంలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్లతోపాటు పలు దుకాణాల్లో మున్సిపల్ అధికారులు సోమ వారం తనిఖీలు నిర్వహించారు. తక్కువ మైక్రాన్ల సాంద్రత కలిగిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొని దుకాణాదారులకు జరిమానా విధించారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో పరిశుభ్రత పా టించాలని సూచించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, మున్సిపల్ సిబ్బంది అక్షయ్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- రోజూ వార్డులలో మిషన్ భగీరథ నీటి సరఫరా
- ఆర్మూర్ మున్సిపల్‌లో ప్రత్యేక ప్రణాళిక

ఆర్మూర్‌టౌన్: వేసవి కాలంలో పట్టణంలోని 36 వార్డుల ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రోజువారీ నీటి సరఫరా పై దృష్టిసారించారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో అదనపు నీరు అవసరమైతే అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణానికి 11 మిలియన్ లీటర్ల నీటి అవసరం ఉంది. ప్రస్తుతం 7 మిలియన్ లీటర్ల నీరు మాత్రమే వస్తుంది. మిషన్ భగీరథ కనెక్షన్లు 14,671, పవర్ బోర్డులు 20,094, చేతిపంపులు 73 ఉన్నాయి. మున్సిపల్ అధికారులు రూ.33 లక్షల ప్రణాళికను ప్రభుత్వానికి పంపించారు. అలాగే పైప్‌లైన్ లీకేజీలు, నీటి సమస్యలు ఉంటే మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకు రావాలని అధికారులు సూచిస్తున్నారు.

నీటి సరఫరా కోసం ..

మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వారా కొన్ని ప్రాంతాలకు నీరు అందిస్తున్నప్పటికీ, తగినంత నీరు అందని చోట పవర్ బోర్డుల ద్వారా సరఫరా చేస్తున్నారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో మూడు ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మరో నాలుగు ట్యాంకర్లు సిద్ధం చేశారు. 10, 11, 12, 13, 14, 15వ వార్డుల్లో మిషన్ భగీరథ ద్వారా నీరు సరఫరా అందిస్తున్నారు.

లీకేజీకి మరమ్మతులు


వాటర్ పైప్‌లైన్ లీకేజీల మరమ్మతుల పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జెండా గుడి, మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్ మహాలక్ష్మి అపార్ట్‌మెంట్ వద్ద ఏర్పడ్డ వాటర్ పైపు లైన్ లీకేజీలను సోమవారం మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. సంబంధిత ప్రాంతాల్లో లీకేజీ కారణంగా నీటి వృథా జరుగుతుండటంతో, వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు.

నీటి సమస్యలు లేకుండా చూస్తాం

పట్టణంలో నీటి సమస్యను నివారించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. మిషన్ భగీరథ ద్వారా తక్కువ నీరు అందుతున్న చోట పవర్ బోర్డుల ద్వారా నీటిని అందించి సమస్య తలెత్తకుండా చూస్తాం. ప్రజలు ఎక్కడైనా నీటి సమస్య ఎదుర్కొంటే అధికారులకు తెలియజేయాలి.

– రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

చదువుతోనే మంచి భవిష్యత్తు

- బోధన్ ఏసీపీ శ్రీనివాస్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఏసీపీ శ్రీనివాస్, తదితరులు

బోధన్: చదువుతోనే మంచి భవిష్యత్తు కల సాకారం అవుతుందని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. ప్రతి విద్యార్థి ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తేవాలని సూచించారు. ఆదివారం రాత్రి పట్టణంలోని ప్రజ్ఞ హైస్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసీపీ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టౌన్ సీఐ వెంకట నారాయణ, తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సాంబిరెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధి వై.శ్రీనివాస్ రావు, పాఠశాల చైర్‌పర్సన్ చౌడమ్మ, కరస్పాండెంట్ చౌడారెడ్డి, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఏడీఈ నగేష్ కుమార్

బోధన్: వేసవి కాలంలో నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం చర్యలు చేపట్టామని ట్రాన్స్‌కో బోధన్ ఏడీఈ నగేష్ కుమార్ అన్నారు. సమ్మర్ యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా లోవోల్టేజ్ సమస్యను తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సోమవారం సాలూర మండల కేంద్రంలోని పురగిరి క్షత్రియ సంఘం భవనం ఎదుట అదనంగా 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయగా ఏడీఈ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌తో వినియోగదారులకు లోవోల్టేజ్ సమస్య ఉండదని వివరించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ కళ్యాణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	ఛావా(హిందీ)-10.15, శబ్దం (తెలుగు) -1.35, సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు) -4.40, అగత్యా(తెలుగు)-7.50, రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-10.40
స్క్రీన్-2	శబ్దం(తెలుగు)-10.05, ఛావా (హిందీ) -1.10, 7.35, 10.55, మజాకా (తెలుగు) -4.30
స్క్రీన్-3-	రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-10.10, మజాకా(తెలుగు)-1.20, గ్యాంగ్స్ ఆఫ్ వేస్ పూర్(హిందీ)-4.25, శబ్దం(తెలుగు)-7.40, 10.45
స్క్రీన్-4	నేనెక్కడున్నా(తెలుగు)-10.45, గార్డ్(తెలుగు)-1.25, ఛావా(హిందీ)-4.00, రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-7.20, మజాకా(తెలుగు)-10.30

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఛావా(హిందీ)-11.00, 4.40, 7.30, 10.20, అగత్యా(తెలుగు)-1.40
స్క్రీన్-2	అగత్యా(తెలుగు)-11.00, 4.40, మజాకా (తెలుగు) - 1.45, 7.35, 10.30
స్క్రీన్-3	గార్డ్(తెలుగు)-10.50, రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్(తెలుగు)-1.40, 7.30, శబ్దం (తెలుగు)-4.40, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఛావా(హిందీ)-10.05, మజాకా (తెలుగు) - 1.25, టర్న్ ఆఫ్‌ది డ్రాగన్ (తెలుగు)-4.30, 7.40, 10.50
స్క్రీన్-2	సంటీప్‌కిషన్ మజాకా(తెలుగు)- 10.00, 4.15, రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)- 1.05, ఛావా(హిందీ)-7.20, 10.40
స్క్రీన్-3	రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-9.40, ఛావా(హిందీ)-12.50 తండేల్(తెలుగు) - 4.10, 10.20, మజాకా(తెలుగు) - 7.15
స్క్రీన్ -4	ఓయ్(తెలుగు)-10.05, జాబిలమ్మ నీకు అంత కోపమా(తెలుగు)-1.30, ఛావా(హిందీ)-4.20, సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)- 7.40, మజాకా(తెలుగు)-10.40
లలితామహల్	తండేల్
దేవి	మజాకా
నటరాజ్	ఛావా(హిందీ)
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	130
		లైవ్	80
స్కిన్‌లెస్	150	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	88,200	వెండి(కిలో)	1,00,500
22 క్యారెట్స్	81,900		

– నిజామాబాద్ బిజినెస్